

సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంవేముల ప్రశాంత్‌రెడ్డి

# ఆలోచించి ఓటెయ్యాలె..

- తమాషాకు ఓటేస్తే భవిష్యత్తు ఉల్టాపల్టా
- కాంగ్రెస్‌కు అవకాశమిస్తే మళ్లీ కష్టాలు
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- వేల్పూర్‌కు పోటెత్తిన జన సునామీ
- ప్రజలను చూసి ముచ్చట పడిన ముఖ్యమంత్రి
- ప్రశాంత్‌రెడ్డి గెలుపు ఖాయమైందన్న బీఆర్‌ఎస్ అధినేత
- వచ్చే ప్రభుత్వంలో పెద్ద మనిషిగానే కొనసాగుతాడని ప్రకటన

నిజామాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే కారు చీకట్లు, పాము కాట్లు, కరెంట్ షాకులు తప్పవని సీఎం కేసీఆర్ అన్నారు. 11 సార్లు ఈ దేశాన్ని పరిపాలించేందుకు అవకాశమిస్తే 55 ఏండ్లపాటు ప్రజలను పిండుకొని తిన్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఓటు హక్కును వృథా చేసుకోవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలకు అసలే వేయొద్దన్నారు. ఆలోచన చేసి ప్రజలకు మేలుచేస్తున్న బీఆర్‌ఎస్‌కే ఓటెయ్యాలని సూచించారు. వేల్పూర్ మండలకేంద్రంలోని స్పైసెస్ పార్కులో గురువారం నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ఏకబిగిన 55 ఏండ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిందని, ఇప్పుడు మళ్లీ ఒక్క ఛాన్స్ ఇవ్వమంటే నమ్మొద్దన్నారు. అధికారంలో ఉన్ననాడు వాళ్లు ఏంచేశారో ఆలోచించాలన్నారు. బాల్కొండలో ప్రశాంత్ రెడ్డికి ముందు, తర్వాత ఏం జరిగిందో చర్చించి ఓటెయ్యాలని కోరారు. ఆయన 18 సబ్ స్టేషన్‌లు కట్టిండని, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు నలభైకి పైగా తెచ్చిండని తెలిపారు. తాను సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్ననాడు ఒక్క సబ్‌స్టేషన్ కోసం మూడేండ్లు తిరిగానని గుర్తుకు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ రాజ్యంలో సగం రాత్రి, సగం పొద్దున కరెంట్ ఉండేదని, గా రాజ్యమే కావాల్నా..? కరెంట్ కాట్లు కావాల్నా..? ఆలోచించాలన్నారు.

**ఎర్రజొన్న బకాయిలు మనమే చెల్లించినం..**

ఆర్మూర్, బాల్కొండలో ఎర్రజొన్నలు పండిస్తే, విత్తనాల కోసం పంజాబ్‌కు పోతాయని, పచ్చజొన్నలు తినేట్లు ఉన్నదా అని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జొన్నలకు మార్కెట్లో ధర లేకున్నా ప్రభుత్వమే కొనుగోలుచేసి రైతుల కోసం నష్టాలను అనుభవిస్తున్నదని చెప్పారు. మునుపు ధాన్యం తీసుకొని వారాలు గడిచినా రైతులకు డబ్బులిచ్చేవారు కాదని, ఇప్పుడు పది రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయని తెలిపారు. రైతు బంధు కూడా టింగ్ టింగ్ మంటూ అకౌంట్లో పడుతున్నదని సీఎం తెలిపారు. రైతు చనిపోతే పైరవీల్లేకుండా ఆ కుటుంబానికి రూ. 5లక్షల బీమా డబ్బులు వచ్చేలా పథకం తెచ్చామన్నారు. కాంగ్రెస్ సర్కారులో ఆపద్బంధు కింద రూ. 50వేలు చేతికి రావాలంటే చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేదని, రూ. 10వేలు చేతికిచ్చి మిగిలింది పైరవీకారులే బుక్కేవారని గుర్తుచేశారు. ధరణితో భూసమస్యలకు చెక్ పడిందన్నారు. నిమిషాల్లోనే పట్టా అయిపోతున్నదని తెలిపారు. మధ్య ప్రదేశ్, ప్రధాని సొంతరాష్ట్రం గుజరాత్‌లో ఎరువుల కోసం చెప్పుల లైన్లు ఉన్నాయన్నారు. ఆర్మూర్‌లో నాడు ఎర్రజొన్నల రైతులను కాల్చేయలేదా అని ప్రశ్నించారు. రైతుల బకాయిలు తాను సీఎం అయ్యాకే రూ.11కోట్లు చెల్లించినట్లు చెప్పారు. దళితబంధు పథకం తన మానస పుత్రిక అంటూ కేసీఆర్ చెప్పారు. తప్పకుండా అమలు చేసి చూపిస్తానన్నారు. రేషన్‌కార్డు ఉన్న 93లక్షల మందికి రైతుబీమా మాదిరిగానే కేసీఆర్ బీమా పెడతామని, ఆరోగ్యశ్రీని రూ.15లక్షలకు పెంచుతామని చెప్పారు. ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు నమస్తే తెలంగాణ సీఎండీ, రాజ్యసభ సభ్యుడు దామోదార్ రావు, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, షకీల్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మార గంగారెడ్డి, మధుశేఖర్, రాజేశ్వర్‌రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్‌ఎండీ రాజేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, కోటపాటి నర్సింహనాయుడు, బాల్కొండ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మహారాష్ట్ర రైతు నాయకుడు రఘునాథ్ దాదా పాటిల్ బృందం పాల్గొన్నారు.

## ప్రశాంత్ రెడ్డి.. పెద్ద మనిషిగానే ఉంటడు..

ప్రశాంత్‌రెడ్డి గురించి చెప్పాల్సిన పనిలేదని, తనకు కొడుకులా.. సొంత మనిషిలా ఉంటాడని కేసీఆర్ కితాబిచ్చారు. క్యాబినెట్‌లో బాధ్యత గల పదవిలో ఉన్నాడని, రేపు కూడా అట్లనే పెద్ద మనిషిలా ఉంటాడని హామీ ఇచ్చారు. దీంతో బాల్కొండ కూడా పెద్దగానే అభివృద్ధి జరుగుతుందన్నారు. హెలిప్యాడ్ వద్దకు వచ్చిన జనాలను చూడగానే వేముల బ్రహ్మాండమైన మెజారిటీతో గెలువబోతున్నాడని అర్థమైందన్నారు. దేశంలోనే 24గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ప్రధాని మోదీకి ప్రైవేటైజేషన్ పిచ్చి పట్టిందని, రైళ్లు, ఓడరేవులు, కరెంటును ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. మోటర్లకు మీటర్లు పెట్టి ముక్కుపిండి పైసలు వసూలు చేయాలని బెదిరించినా తాను పెట్టలేదని చెప్పారు. తెలంగాణలో వలసలు, కరువు, మంచినీళ్లు లేని దుస్థితి ఉండేదని, తలాపున నీళ్లున్నా మంచినీళ్లు దొరకలేదన్నారు. 55ఏండ్ల కిందటి తెలంగాణ కావాలని భావించి, రైతు దగ్గర డబ్బుండాలనే పాలసీ పెట్టుకొని ఐదారు చర్యలు తీసుకున్నామన్నారు. ఫ్రీ కరెంట్, పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోళ్లు చేపట్టామని చెప్పారు. నీటి తీరువా పన్ను రద్దుచేశామని గుర్తుచేశారు.

## మోతెకు వందనం..

బాల్కొండకు ఎప్పుడొచ్చినా గుర్తుకు వచ్చేది మోతె గ్రామమని, ఆ గ్రామ మట్టిలో ఉన్న బలం అలాంటిదని కేసీఆర్ ఉద్యమకాలం నాటి గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఉద్యమంలో అందరికన్నా ముందు మోతె గ్రామం తీర్మానం చేసి తెలంగాణ కావాలని పిడికిలెత్తి నిలబడిందన్నారు. మోతె గ్రామం మట్టిని ముడుపు కట్టి హైదరాబాద్‌కు తీసుకుపోయానని, తెలంగాణ వచ్చాక అదే మట్టిని తెచ్చి మోతెలో కలిపానంటూ వివరించారు. ఈ సందర్భంగా వేదికపై మోతె గ్రామానికి శిరస్సు వంచి నమస్కరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా రాజకీయ పరిణితి పెరగడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు రాగానే ఎవ్వడిని పడితే వాణ్ని ఇష్టమొచ్చినట్లు తిట్టే దుష్ట సంప్రదాయం ఏర్పడిందని ఆవేదన చెందారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఉల్టా వినియోగిస్తే ఐదేండ్ల భవిష్యత్తును కిందమీదికి జేస్తుందని చెప్పారు. ఓటు మన కిస్మత్‌ను మారుస్తుందన్నారు. తమాషాకు ఓటెయ్యొద్దని సూచించారు. ఎవరికి వారు చర్చించి ఓటేసిననాడు గ్యారంటీగా ప్రజలు గెలుస్తారని, అదే ప్రజాస్వామ్యంలో నిజమైన గెలుపని అన్నారు.



సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్లకారులతో సందడి చేస్తున్న జనం

# నీళ్లు, కరెంటుకు ఢోకా లేదు

- సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి
- బీఆర్‌ఎస్‌ది సంక్షేమ మ్యానిఫెస్టో
- బాల్కొండ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి



ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/వేల్పూర్, నవబంర్ 2: బాల్కొండ నియోజకవర్గ రైతులు గతంలో నీళ్లు, కరెంటు కోసం ఎన్నో తిప్పలు పడ్డారని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎస్సారెస్పీ పునర్జీవం, ఎత్తిపోతల పథకాలు, వాగులపై ఎక్కడికక్కడ చెక్ డ్యాములు నిర్మించుకోవడంతోపాటు కొత్తగా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం నీళ్లు, కరెంటుకు ఏమాత్రం ఢోకా లేదన్నారు. బాల్కొండ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో వేముల మాట్లాడుతూ.. తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ఒకప్పుడు బోరు బావుల కింద సాగుకు, ఎత్తిపోత పథకాలకు భయంకరమైన కరెంటు తిప్పలు ఉండేవని గుర్తుచేశారు. సీఎం ఆశీర్వాదంతో రైతుల సమస్యలన్నీ తొలగిపోయాయని తెలిపారు. కొత్తగా 18 సబ్‌స్టేషన్లను నిర్మించుకొని కరెంటు కష్టాలను శాశ్వతంగా దూరం చేసుకున్నామన్నారు. పునర్జీవ పథకంతో నియోజకవర్గం సస్యశ్యామలం అయ్యిందని తెలిపారు. వరద కాలువ, కాకతీయ కాలువ నిండు కుండల్లా ఉంటున్నాయన్నారు. లక్ష్మి, గుత్ప, నవాబు తదితర ఎత్తిపోతల పథకాలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ఎన్నో చెక్ డ్యాములు నిర్మించుకున్నామని వివరించారు.

**సీఎం సహకారంతో అసాధారణ అభివృద్ధి..**

నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ దయతో అసాధారణ అభివృద్ధి జరిగిందని వేముల తెలిపారు. రూ. వెయ్యి కోట్లతో బ్రహ్మాండమైన బీటీ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించుకున్నామని, ఆలయాలు, చర్చిలు, మసీదులను పునరుద్ధరించామని తెలిపారు. అన్ని వర్గాలకూ సంక్షేమాన్ని అందించే మ్యానిఫెస్టోను రూపొందించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ప్రదాత అయిన కేసీఆరే మళ్లీ సీఎం కావడం ఖాయమని అన్నారు. ముఖ్యమంత్రి, తనను ఆశీర్వదించేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**అభివృద్ధి పనులకోసం వేముల వినతి..**

బాల్కొండ నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి పనులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు మంత్రి విన్నవించారు. చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇప్పుడున్న సిమెంట్ పైప్‌లైన్ స్థానంలో స్టీల్ పైప్‌లైన్ ఇవ్వాలని కోరారు. భీమ్‌గల్ లింబాద్రి గుట్ట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, బాల్కొండను మున్సిపాలిటీగా మార్చాలని, వేల్పూర్‌కు జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని విన్నవించారు. కొత్తగా 5వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు, గృహలక్ష్మి పథకం కింద 10వేల కుటుంబాలకు ఆర్థికసాయం, పీఎఫ్ ఉన్న మహిళలకు బీడీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. రహత్‌నగర్, వాడి-కొత్తపల్లి, బుస్సాపూర్-కిసాన్‌నగర్‌కు విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని విన్నవించారు. పునర్జీవ పథకంతో ఎస్సారెస్పీ జలకళను సంతరించుకున్నదని, ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వేదికపై వేల్పూర్ మాజీ జడ్పీటీసీ రాజేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరగా, మంత్రి కండువా కప్పి ఆహ్వానించారు.


